## క్లుప్తంగా

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం


పూజలందుకున్న పెద్దమ్మ అవ్వ

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలోని ఉప్పరకట్ట వద్ద వెలసిన పెద్దమ్మ అవ్వ ఆలయ వార్షికోత్స వం మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే అమ్మవారిని పూలతో అలంకరించి అర్చకులు ప్రసాద్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

### లారీ బోల్తా

● డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలు


జొన్నగిరి సమీపంలో బోల్తా పడిన లారీ

తుగ్గలి: లారీ బోల్తా పడి డ్రైవర్, క్లీనర్ గాయపడ్డారు. ఆదోని నుంచి గుత్తి వైపు ఇసుకలోడుతో వెళ్తున్న లారీ జొన్నగిరి సబ్‌స్టేషన్ సమీపంలో అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్పగాయాలతో బయటపడ్డారు. విషయం తెలుసుకున్న జొన్నగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108 వాహనానికి సమాచారం అందించి క్షతగాత్రులను గుత్తి ఆస్పత్రికి తరలించారు.

### సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న డాక్టర్ రేష్మా

ఆలూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రేష్మా సిబ్బందికి సూచించారు. మంగళవారం మొలగవల్లి పీహెచ్‌సీ వైద్యారోగ్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఇంటి పరిసరాలు, ఇంట్లో దోమలు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు సూచించాలన్నారు. రోజు విడిచి రోజు జ్వరం, దగ్గు, తలనొప్పి, ఒళ్లు నొప్పులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలని సూచించారు. సమావేశంలో ఎంపీహెచ్‌ఓ అంద్రూస్, సూపర్‌వైజర్లు కళావతి, బాషా ఉన్నారు.

### నాణ్యమైన భోజనం అందించాలి


రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ విశ్వమోహన్

కృష్ణగిరి: వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీఓ విశ్వమోహన్ వార్డెన్ నాగేశ్వరరెడ్డికి సూచించారు. మండల పరిధిలోని ఎరుకలచెరువు గ్రామంలోని ఎస్సీ హాస్టల్‌ను మంగళవారం తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వసతిగృహ పరిసరాలు, భోజనశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో నీటి సౌకర్యం సక్రమంగా లేదని విద్యార్థులు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు.

### గోవులకు టీకా


ఆవుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారులు

మద్దికెర: మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని శ్రీరంగనాథస్వామి ఆలయ గోశాలలో మంగళవారం పశువైద్యాధికారి కృష్ణానాయక్ గోవులకు టీకా వేశారు. పశువులకు సకాలంలో టీకాలు వేయించడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

### చేపల పెంపకంలో నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎఫ్‌డీఓ చంద్రయ్య

మద్దికెర: చెరువుల్లో చేపల పెంపకంలో నిబంధనలు పాటించాలని మత్స్యశాఖ అభివృద్ధి అధికారి చంద్రయ్య సూచించారు. మంగళవారం పంచాయతీ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈఓ శివకుమార్, పంచాయతీ సభ్యులు లక్ష్మీ నారాయణ, బాలచంద్ర, మత్స్యశాఖ సహాయకులు వసంత, సభ్యులు భాస్కర్, సుంకన్న, నాగరాజు పాల్గొన్నారు.

# ముమ్మరంగా ఇంటింటి ఓటరు సర్వే

● ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ
● ఆలూరు నియోజకవర్గంలో ప్రారంభమైన ప్రీ రివిజన్ యాక్టివిటీ
● అక్టోబరు 18 వరకు ఇంటింటి పరిశీలన
● 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటరుగా అర్హులు
● 2025 జనవరి 6వ తేదీ ఓటర్ల తుది జాబితా విడుదల


ఆలూరులో ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలిస్తున్న అసెంబ్లీ ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ రాము నాయక్

ఆలూరు రూరల్: ఫొటో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం 2025ను చేపట్టాలని భారత ఎన్నికల సంఘం అధికారులను ఆదేశాలు జారీ చేసింది. 2025 జనవరి 1 అర్హత తేదీగా నిర్ణయిస్తూ షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో ఆలూరు నియోజకవర్గంలో ప్రీ రివిజన్ యాక్టివిటీ ప్రారంభమైంది. ఈ మేరకు బీఎల్‌ఓలు ఇంటింటి పరిశీలన చేపడుతున్నారు.

**బీఎల్‌ఓలుగా సచివాలయ ఉద్యోగులు**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అంగన్‌వాడీ వర్కర్ల స్థానంలో గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులను బీఎల్‌ఓలుగా నియమించి శిక్షణ ఇచ్చారు. నియోజవర్గంలో 294 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. వాటి పరిధిలో బీఎల్‌ఓల ఇంటింటి పరిశీలన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 21 నుంచి ప్రారంభమైంది. అక్టోబర్ 18వ తేదీ వరకు ఈ పరిశీలన కొనసాగనుంది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారిని బీఎల్‌ఓలు గుర్తించాలి. ఒకే వ్యక్తి పేరు ఓటరు జాబితాలో రెండు, మూడు చోట్ల ఉన్నా విషయాన్ని, చనిపోయిన వారి వివరాలు, శాశ్వతంగా ఒక ప్రాంతం నుంచి వెళ్లిపోయిన వారి పేర్లను బీఎల్‌ఓలు తమ ఇంటింటికి పరిశీలించి రికార్డుల్లో నమోదు చేయాలి. ఓటర్ల జాబితాలో డెమోగ్రాఫిక్ సిమిలర్ ఎంట్రీస్, ఫొటో సిమిలర్ ఎంట్రీస్ (ఇతర జిల్లాలు,నియోజవర్గాల్లోని ఓటర్లు, ఫొటోలు) గుర్తించాలి.

**అక్టోబర్ 18కి పూర్తి..**

నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రాలను వంద శాతం సందర్శించడంతో పాటు రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చించాల్సి ఉంటుంది. ప్రతి పోలింగ్ కేంద్రంలో ఓటర్ల సంఖ్య 1,500 మించకుండా ఉండాలి. పోలింగ్ కేంద్రం ఓటర్లకు రెండు కిలో మీటర్లు పైబడి ఉండరాదు. ఇలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి చేయాల్సి ఉంటుంది. అక్టోబర్ 18 నాటికి ఈ కార్యక్రమం పూర్తి కావాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. అక్టోబర్ 19 నుంచి 28వ తేదీ వరకు ఫార్మెట్-1 నుంచి 8 వరకు సిద్ధం చేయాలి. అలాగే ఇంటిగ్రేటెడ్ డ్రాఫ్ట్ రోల్ తయారు చేయాల్సి ఉంటుంది. అక్టోబరు 29వ తేదీ సమగ్ర ఓటర్ల ముసాయిదా జాబితాను నియోజకవర్గ ఎన్నికల అధికారి విడుదల చేస్తారు. ఆ రోజు నుంచి నవంబరు 28 వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. డిసెంబరు 24వ తేదీ నాటికి అభ్యంతరాల పరిష్కారం పూర్తి కావాలి. 2025 జనవరి నాటికి 6వ తేదీ తుది ఓటరు జాబితా ప్రకటించనున్నారు.

**పక్కాగా ఓటర్ల సవరణ**

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ఓటర్ల జాబితా పక్కాగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నాం. నియోజకవర్గంలోని 294 పోలింగ్ కేంద్రాల్లోని ప్రతి ఇంటికి బీఎల్‌ఓలు వెళ్లి ఓటర్ల జాబితాలో పేర్లు, ఫొటోలు, అడ్రస్ మార్పులతో పాటు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించాలని ఆదేశాలు జారీ చేశాం. ఫారం-6, 7, 8 స్వీకరించి నివేదిక తయారు చేయాలని సూచించాం. ప్రజలు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణను సద్వినియోగం చేసుకోవాలి.

– రాము నాయక్, ఆలూరు అసెంబ్లీ ఎలక్టరోల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్,

### వలంటీర్లకు న్యాయం చేయాలి

ఆస్పరి: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వలంటీర్లకు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆలూరు తాలూకా కార్యదర్శి మునిస్వామి మంగళవారం డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వలంటీర్లను విధుల్లోకి తీసుకోవడమే కాకుండా నెల రూ.10వేలు జీతం ఇవ్వాలన్నారు.

### ఎం.కొట్టాలలో ఉచిత వైద్య శిబిరం

ఆలూరు రూరల్: ఎఫీ అగాపే మిషన్ గుత్తి వారి ఆధ్వర్యంలో మండలంలోని ఎం.కొట్టాల గ్రామంలో మంగళవారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరాన్ని గుత్తి చర్చి పాస్టర్ అద్భుత కుమార్ ప్రారంభించారు. ఎఫీ అగాపే మిషన్ ఆధ్వర్యంలో ఇలాంటి మంచి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామస్తులకు బీపీ, ఈసీజీ, 2డీ ఎకో వంటి గుండె సంబంధిత పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు సత్యానందం, జోయల్, భాస్కర్, గ్రామ పెద్దలు దేవపుత్ర, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

### ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు

పత్తికొండ(తుగ్గలి): పట్టణంలోని టీచర్స్ కాలనీలో మంగళవారం ఓ ట్రాన్స్ ఫార్మర్ పేలి మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళన చెందారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఏఈ నారాయణస్వామి సిబ్బంది మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

## ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


నృత్యాలు చేస్తున్న బాలికలు


పూజలందుకుంటున్న కృష్ణుడు


పల్లకీలో ఆలయ ప్రదక్షిణలు చేస్తున్న స్వామి వారు


కడమకుంట్లలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణ విగ్రహం


నేమకల్లులో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

మద్దికెర: మండల కేంద్రంలో మంగళవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కృష్ణుని ఆలయంలో స్వామి వారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం స్వామి వారి చిత్ర పటాన్ని మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

**శ్రీరంగనాథుడికి పల్లకీ సేవ**

మద్దికెర మండల పరిధిలోని పెరవలి గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీరంగనాథస్వామి ఆలయంలో మంగళవారం గోకులాష్టమి సందర్భంగా స్వామి వారికి బిందెసేవ, అష్టోత్తర నామార్చనతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తులను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రదక్షిణలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు రంగస్వామి పాల్గొన్నారు.

**భక్తిశ్రద్ధలతో కృష్ణాష్టమి**

తుగ్గలి: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను మంగళవారం కడమకుంట్లలో ఘనంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంత సమితి సభ్యుల ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని ప్రతిమను ప్రతిష్ఠించారు. గ్రామస్తులు కృష్ణమందిరాన్ని దర్శించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. సాయంత్రం మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కృష్ణగిరి: మండల పరిధిలోని చిట్యాల గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సమితి ఆధ్వర్యంలో కృష్ణుని విగ్రహాన్ని ప్రతిష్ఠించి మంగళవారం పూజలు నిర్వహించారు. ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు విగ్రహం వద్ద భజన కార్యక్రమం, చిన్నారులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సమితి అధ్యక్షుడు దస్తగిరి, సభ్యులు కోయిలకొండ రామాంజనేయులు, మదన్‌శేఖర్, సుధాకర్, మల్లికార్జున, రవికుమార్, జయసుధ పాల్గొన్నారు.

చిప్పగిరి: త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో మండలంలోని నేమకల్లు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. రెండవ రోజు మంగళవారం గ్రామ పెద్దలు, సేవా సమితి సభ్యుల ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి ప్రతిమను పురవీధుల గుండా ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చి కొబ్బరి కాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రేమ్ కుమార్, రవితేజ, వేణు, కృష్ణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలను సహించం


అక్రమ కట్టడాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మద్దికెర: అక్రమ కట్టడాలు సహించేది లేదని ఈఓ శివకుమార్ హెచ్చరించారు. మంగళవారం జెడ్పీ బాలికల పాఠశాల వద్ద రోడ్డుపై అక్రమంగా కడుతున్న నిర్మాణాన్ని నిలిపేశారు. పంచాయతీ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టరాదని అలాంటి వాటిని కూల్చివేస్తామని హెచ్చరించారు. ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు గ్రామాభివృద్ధికి సహకరించాలని కోరారు. బస్టాండు వద్ద రోడ్డుకు అడ్డంగా ఉన్న వ్యాపార బంకులను తొలగించాలని స్థానికులు ఈఓ దృష్టికి తీసుకొచ్చారు. యజమానులకు నోటీసులు జారీ చేసి, తొలగిస్తామని హామీ ఇచ్చారు.

## గ్రాప్లింగ్ రెజ్లింగ్‌లో పతకాలు


మెడల్స్ సాధించిన విద్యార్థినులతో తహసీల్దార్ నజ్మాబాను

హాలహర్వి: స్థానిక కస్తూర్బా విద్యాలయానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు ఈనెల 25, 26వ తేదీల్లో రేణిగుంటలో జరిగిన రాష్ట్ర స్థాయి గ్రాప్లింగ్ రెజ్లింగ్ (కుస్తీ పోటీలు) పోటీల్లో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ మేరకు మంగళవారం స్థానిక పాఠశాలలో విద్యార్థినులను తహసీల్దార్ నజ్మాబాను, సీనియర్ అసిస్టెంట్ సుశీలమ్మ అభినందించి మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను అందజేశారు. తహసీల్దార్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పోటీల్లో జి.లక్ష్మి, ఇందు, శబరి, మాబిని, ఎం.లక్ష్మి, సుకన్య, అరుణలు 2 బంగారు పతకాలు, 2 సిల్వర్ పతకాలు, 3 బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. వీరు అక్టోబర్‌లో జరగబోయే జాతీయస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

## చిత్రకళలో హొళగుంద విద్యార్థుల ప్రతిభ


మైమునాకు ప్రశంసా పత్రం, షీల్డ్‌ను అందజేస్తున్న హెచ్‌ఎం, టీచర్లు

హొళగుంద: ఆదోని డివిజన్ స్థాయి చిత్రకళా పోటీల్లో హొళగుంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థులు టీపీ మైమునా, మంజునాథలు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఆదోని పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 25న అఖిల భారత కన్నడ మహాసభలు నిర్వహించారు. అందులో భాగంగా నిర్వాహకులు కన్నడ మీడియం విద్యార్థులకు డివిజన్ స్థాయి చిత్రలేఖనం, ఇతర పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో తమ విద్యార్థులు నైపుణ్యం కనబరిచినట్లు హెచ్‌ఎం నజీర్ అహమ్మద్ తెలిపారు. సదరు విద్యార్థులకు మంగళవారం హొళగుందలో ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లు అందజేసి అభినందించారు.

## పంట కోత ప్రయోగాలు పకడ్బందీగా నిర్వహించాలి


మాట్లాడుతున్న ఏడీఏ సునిత

ఆలూరు: వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలపై కోత ప్రయోగం శాంపిల్స్ సేకరణ పకడ్బందీగా నిర్వహించి సమగ్రంగా నివేదికను అందజేయాలని ఆలూరు వ్యవసాయ సంయుక్త సంచాలకులు సునిత ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో మంగళవారం సబ్‌డివిజన్ పరిధిలోని ఏఓ, ఎంపీఓలు, ఏఏస్‌ఓలు, రైతు సేవా కేంద్రాల సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడీఏ సునిత మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో రైతులు ఖరీఫ్ సీజన్‌లో పత్తి, కొర్ర, మిరప, పొద్దుతిరుగుడు, వేరుశనగ, జొన్న, సజ్జ పంటల శాంపిల్స్‌ను త్వరితగతిన సేకరించాలన్నారు.

## సుంకులమ్మకు చలువ బిందెల సమర్పణ


చలువ బిందెలను తీసుకెళ్తున్న భక్తులు

ఆస్పరి: వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ మంగళవారం మండలంలోని బిణిగేరి గ్రామంలో సుంకులమ్మవ్వకు చలువ బిందెలను భక్తులు సమర్పించారు. గ్రామంలో చలువ బిందెలను మేళతాళాలతో సుంకులమ్మవ్వ ఆలయం వరకు ఊరేగించారు. పూజలు నిర్వహించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.

### ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌ను పునరుద్ధరించాలి


డీఆర్‌ఎంను కలిసి వినతి పత్రం అందజేస్తున్న జిల్లా బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ

ఆదోని అర్బన్: ఆదోని, మద్దికెర స్టేషన్‌లలో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాప్‌ను పునరుద్ధరించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ కోరారు. నూతనంగా నియమితులైన గుంతకల్ డివిజనల్ రైల్వే మేనేజర్ ఎం.విజయ్‌కుమార్‌ను మంగళవారం గుంతకల్ రైల్వే నిలయంలోని డీఆర్‌ఎం కార్యాలయంలో కలిశారు. పలు సమస్యలపై వినతి పత్రాన్ని అందించారు. నీలకంఠ మాట్లాడుతూ మద్దికెర రైల్వేస్టేషన్ నుంచి వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు కోవిడ్ ముందు స్టాప్ ఉండేదని, కోవిడ్ తర్వాత స్టాప్‌ను ఎత్తి వేశారన్నారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు గమ్యస్థానానికి చేరడానికి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

## నాణ్యత లేకపోతే బ్లాక్‌లిస్టులో పెడతాం


మార్లమడికి బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఐయూ డీఈ భాస్కర్

ఆలూరు: రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారంగా పనులను చేస్తే బ్లాక్ లిస్టులో ఉంచుతామని ఆలూరు పీఐయూ డీఈ భాస్కర్ కాంట్రాక్టర్లను హెచ్చరించారు. మంగళవారం హొళగుంద మండల కేంద్రం నుంచి 4.5 కిలోమీటర్లు నాబార్డు నిధులతో రూ.5.34 కోట్లతో చేస్తున్న బీటీ రోడ్డు పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుతం బీటీ రోడ్డు పనులకు ముందు గ్రావెల్‌కు వాడుతున్న కంకర సైజు, రోలర్ తదితర పనులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రతి టెండర్ దారుడు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా చిప్పగిరి మండల కేంద్రం నుంచి మద్దికెర, వయా నంచర్ల గ్రామం వరకు దాదాపు 13 కిలోమీటర్ల రూ.10 కోట్లతో చేపట్టిన బీటీ రోడ్డు పనులను వేగవంతం చేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. జేఈ చంద్రశేఖర్ , సిబ్బంది తదితరులు ఉన్నారు.

### నేడు మండల సర్వసభ్య సమావేశం

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధ వారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గౌరీదేవి మంగళవారం తెలిపారు. సమావేశానికి అన్నిశాఖల అధికారులు తమతమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలన్నారు.

### ఉపాధి సిబ్బందిపై వేటు

వెల్దుర్తి: ఉపాధి సిబ్బందిపై వేటు పడింది. 17వ విడత సామాజిక తనిఖీలో భాగంగా మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ సిబ్బంది తనిఖీలు చేపట్టి పనులలో జరిగిన అక్రమాలను వెల్లడించారు. బాధ్యులైన ఏపీఓ రమావత్ రాజు, ఈసీ రాజన్‌భరత్, టీఏలు సి.రాజశేఖర్, శ్రీనివాసరావ్, జే.రాజశేఖర్, కంప్యూటర్ ఆపరేటర్ మహిపాల్‌రెడ్డితోపాటు సర్పరాజపురం, బుక్కాపురం, శ్రీరంగాపురం ఫీల్డ్ అసిస్టెంట్‌లు, కృష్ణాపురం సీనియర్ మేటీని సస్పెండ్ చేసినట్లు ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప మంగళవారం తెలిపారు.

### నేడు దేవనకొండకు ఎమ్మెల్యే రాక

దేవనకొండ: మండల కేంద్రమైన దేవనకొండలో బుధవారం జరిగే సర్వసభ్య సమావేశంలో ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యేగా మొదటిసారిగా వస్తున్నారన్నారు. మండలస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికై చర్చించడం జరుగుతుందన్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై సమస్యలపై చర్చిస్తారన్నారు.

### ఎస్టీ రిజర్వేషన్ సాధనకు పోరాడుదాం

ఆదోని రూరల్: వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ సాధించే అంశంపై పోరాడడానికి ప్రతి వాల్మీకి బిడ్డ నడుంబిగించి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్‌భీంనాయుడు అన్నారు. మంగళవారం ఆదోని పట్టణంలోని శ్రీ లక్ష్మమ్మవ్వ నగర్‌లో వాల్మీకి రంగన్న అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. రామ్‌భీంనాయుడు మాట్లాడుతూ గత 60 సంవత్సరాల నుంచి వాల్మీకులకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని అనేక ఉద్యమాలు చేస్తున్నప్పటికీ ఎలక్షన్ల సమయంలో మాత్రమే హామీలు ఇస్తున్నారే తప్పా ఇప్పటి వరకు జరిగింది శూన్యమన్నారు.

## ముగిసిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు


పల్లకోత్సవం ప్రారంభిస్తున్న ఆలయ కమిటీ నిర్వహకులు

ఆలూరు: స్థానిక కోటవీధిలో కొలువుదీరిన శ్రీ సిద్ధేశ్వరస్వామి ఉత్సవాలు మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ముగిశాయి. ఈనెల 25వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. భక్తిశ్రద్ధలతో స్వామి ఉత్సవమూర్తిని పల్లకీలో ఆశీనులు గావించి ఊరేగింపుగా తేరు గడ్డకు చేరుకున్నారు. అక్కడ రథంపై అధిష్ఠించిన అనంతరం భీమలింగేశ్వరస్వామి సమీపంలోని ఎదురు బసవన్న గుడి వద్దకు రథాన్ని లాగి యథాస్థానానికి చేర్చారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ఆలయ ప్రధాన అర్చకులు రేణుకారాధ్యా స్వామి ఆధ్వర్యంలో గంగ, ఫల, పుష్ప, పంచామృతాభిషేకం, మహా మంగళహారతి తదితర పూజలను చేశారు. అనంతరం చంద్రశేఖర య్యస్వామి దంపతులు ముగింపు పూజలు చేశారు.

## నష్టపోయిన రైతులను ఆదుకోవాలి


మెదేహాల్ వద్ద పొలంలో ఇసుకమేటను చూపుతున్న రైతు హరినాథ్‌రెడ్డి

హాలహర్వి: అధిక వర్షాల వల్ల పంటలు నష్టపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని మెదేహాల్ గ్రామానికి చెందిన రైతు హరినాథ్‌రెడ్డి కోరాడు. మండలంలోని మెదేహాల్ గ్రామంలో నేషనల్ హైవే కాంట్రాక్టర్ ఎస్‌ఆర్‌కే కంపెనీ వారు తమ గ్రామం వద్ద నిర్మించిన తాత్కాలిక వంతెన వల్ల తమ పొలాలవైపు వంకనీరు వచ్చి పంటలు కొట్టుకుపోతున్నాయన్నాడు. పంట పొలాల్లో మట్టి, ఇసుక మేటలు వేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు. నాకు ఉండే 15 ఎకరాల్లో రెండున్నర ఎకరాలు నీటికుంట కోసం దాదాపుగా రూ.25 లక్షలు ఖర్చు పెట్టుకుని తవ్వించానని, ఈ వంక వల్ల పూర్తిగా మట్టితో కప్పు పడిందని చెప్పాడు. ఐదు ఎకరాల్లో మిరప, మిగిలిన 10 ఎకరాల్ల వరి సాగుచేయగా, వర్షాల దెబ్బకు పంటలన్నీ నాశనమయ్యాయని వాపోయాడు. ప్రభుత్వం తన లాంటి రైతులను ఆదుకోవాలని కోరాడు.

## సస్యరక్షణ పద్ధతులతో అధిక దిగుబడులు


మాట్లాడుతున్న కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె.రాఘవేంద్రచౌదరి

ఎమ్మిగనూరురూరల్: పత్తి సాగులో రైతులు సమగ్ర సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.కె.రాఘవేంద్రచౌదరి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణపై కేవీకే-ఎటీసీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధిక దిగుబడి కోసం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే మంచి దిగుబడులు సాధించవచ్చని చెప్పారు. ఈ పద్ధతిలో ప్రత్తి ఏపుగా పెరగకుండా మొదట ఏర్పడిన కాయలను నిలుపుకోవటానికి ×మెపిక్వాట్ క్లోరైడ్× అనే మందును మొక్కల పెరుగుదల నియంత్రణకు ఉపయోగించాలన్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు వచ్చే అవకాశం ఉందని, రైతులు విత్తిన 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగులను గమనిస్తూ ఉండాలన్నారు. పురుగును గుర్తిస్తే వెంటనే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మొదటిగా 150 మందికి ఉచితంగా లింగాకర్షణ బుట్టలను పంపిణీ చేయటం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా.మౌనిక, డా.చందన, డా.విష్ణువర్ధన్‌రెడ్డి, రవీంద్ర, ఎల్డీసీ కంపెనీ ప్రతినిధి రాఘవరెడ్డి, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.